క్యాన్సర్ రహిత దేశమే లక్ష్యం



తిరుపతి: క్యాన్సర్ అవగాహన ర్యాలీలో మేయర్ శిరీష, ఇతర వైద్యాధికారులు



చంద్రగిరి: ఎంబీయూలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

తిరుపతి తుడా : క్యాన్సర్‌పై నిర్లక్ష్యం వహించొద్దని మేయర్ శిరీష తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, డాక్టర్లు కె.మాధవి, రవిప్రభు, నిర్మల, హరిబాబు పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

తిరుచానూరు: క్యాన్సర్ రహిత దేశమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎస్వీయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ బీవీ.మురళీధర్ పిలుపునిచ్చారు. ఎస్వీయూలోని మానవ హక్కులు, సామాజిక అభివృద్ధి, పాపులేషన్ స్టడీస్ అండ్ సోషల్ వర్క్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ విభాగాలు, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా క్యాన్సర్‌పై అవగాహన, ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. అవగాహన ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.రవిబాబు మాట్లాడుతూ బీడీ, సిగరెట్లు, గుట్కా, మద్యపానం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సరైన సమయంలో లక్షణాలను గుర్తించక క్యాన్సర్ బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. టాటా ట్రస్ట్ నిర్వహిస్తున్న గులాబీ బస్సు ద్వారా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ నుంచి పూలే విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాపులేషన్ స్టడీస్ అధ్యాపకులు కేవీ.సునీల్‌కుమార్, కోదండరామిరెడ్డి, పార్థసారథి, శివప్ప, హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ అధ్యాపకుడు జి.రంజిత్‌కుమార్, వెంకటయ్య, ఎం.శ్రీధర్, ఉమెన్స్ స్టడీస్ అధ్యాపకులు వెంకటరమణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్

తిరుచానూరు: అవగాహనతో క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హేమంత్, డాక్టర్ స్వాతి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో, టాటా ట్రస్ట్ సంయుక్తంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళావర్సిటీ ఆవరణలో టాటా ట్రస్ట్ ప్రతినిధులు క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సునీత, అనిత, పద్మావతి, కిశోరి, యువశ్రీ పాల్గొన్నారు.

ఎంబీ యూనివర్సిటీలో..

చంద్రగిరి: మండలంలోని శ్రీసాయినాథ నగర్‌లో ఉన్న మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో శనివారం ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పారా మెడికల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యాపకులు అవగాహన కల్పించారు. లంగ్, థైరాయిడ్, బ్రెస్ట్ క్యాన్సర్లపై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. పొగాకు నమలడం, పొగ పీల్చడం, మద్యపానం వల్లక్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ సారథి, పారా మెడికల్ డీన్ శంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యవంతంగా చింతలచేను రోడ్డు



మాస్టర్ ప్లాన్ రోడ్డుపై సూచనలు చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా : ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి హీరో హోండా రైల్వే గేట్ వరకు నిర్మిస్తున్న చింతలచేను– కొంకా చెన్నాయగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రధాన రహదారిగా నిలుస్తుందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చింతలచేను, కొంకాచెన్నాయగుంట పరిసర ప్రాంత ప్రజలు దశాబ్దకాలంగా సరైన రోడ్డు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోలు మినహా ఇతర వాహనాలు వెళ్లలేని స్థితిలో వున్న కాలనీలకు ప్రముఖ రహదారిగా మాస్టర్ ప్లాన్ రోడ్డును తీసుకువస్తున్నామన్నారు. సరైన రోడ్డు లేకపోవడంతోనే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తిరుపతి నగరంలోకి రావడానికి ఒకటిరెండు రోడ్లు మాత్రమే వుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు, నగరానికి కనెక్టివిటీ పెంచేందుకు, తిరుపతిని మరింత విస్తరింప చేసేందుకు ఏకకాలంలో మున్సిపల్ కార్పొరేషన్ 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను చేపట్టిందన్నారు. తద్వారా నగరానికి తూర్పు ప్రాంతంలో 3,500 ఎకరాల్లో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీబీఆర్ డాక్టర్ వైఎస్సార్ మార్గ్, రేణిగుంట–కరకంబాడి రోడ్లను కలుపుతూ అన్నమయ్య మార్గ్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఆ ప్రాంతానికి ఇప్పుడు పదింతల విలువ పెరగడంతో పాటు నగరానికి కనెక్టివిటీ పెరిగిందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీర్చుతుండడంతో మిగిలిన రోడ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డీఈ సంజయ్‌కుమార్, కార్పొరేటర్ అమరనాథరెడ్డి, పులికంటి గోపీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వంశీ, సోమశేఖర్‌రెడ్డి, కోటి, ఏఈ మునిరామయ్య పాల్గొన్నారు.

సజ్జలకు ఘన స్వాగతం



తిరుపతి రూరల్: తిరుమల పర్యటన నిమిత్తం శనివారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. శాలువతో సత్కరించారు. సజ్జల తిరుపతి విమానాశ్రయం నుంచి నేరుగా తిరుమలకు బయలుదేరివెళ్లారు.

నేడు సచివాలయాల ప్రారంభోత్సవం

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజకవర్గం మంగళంలోని రణధీర్‌పురం, మంగళం పంచాయతీల్లో నిర్మించిన సచివాలయాలను ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

- తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి వీర్రాజు
- ఆర్టీసీలో ముగిసిన భద్రతా వారోత్సవాలు
- సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు



డ్రైవర్లకు అవార్డు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జడ్జి వీర్రాజు, డీపీటీవో చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఒక్క నిమిషం సహనం పాటిస్తే నిండు ప్రాణాలను కాపాడుకోవచ్చని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జ్ వీర్రాజు తెలిపారు. ఆర్టీసీ తిరుపతి అలిపిరి డిపోలో శనివారం రాత్రి రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన 33 మంది డ్రైవర్లకు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. జడ్జి మాట్లాడుతూ మనుషులకు ఆస్తులపై ఉన్న శ్రద్ధ ప్రాణాలపై ఉండడం లేదని వాపోయారు. ఇంటి నుంచి మరో ప్రాంతానికి వెళ్లేటప్పుడు భద్రతకు తీసుకుంటున్న చర్యలు ప్రయాణ సమయంలో తీసుకోవడంలేదన్నారు. ప్రమాదానికి గురైన వారిని ఆస్పత్రికి తరలించాలని, తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లతోపాటు కండక్టర్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల శ్రీకాళహస్తి డిపోకు చెందిన డ్రైవర్ చిన్నికృష్ణకు డ్రైవింగ్ సమయంలో గుండెపోటు వచ్చిందన్నారు. ఆయన తన ప్రాణాలకన్నా ప్రయాణికులను కాపాడాలనే ఉద్దేశంతో బస్సును పక్కన పెట్టి స్టీరింగ్ పైనే మృతి చెందారని పేర్కొన్నారు. ఆర్టీవో సీతారామిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో ట్రాఫిక్ నియమాలను పాటించాలని చెప్పారు. ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం భాస్కర్, పీవో పార్థసారథి, డీఎంలు బాలాజీ, ప్రభాకర్, ఏటీఎం రామచంద్రనాయుడు, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు అర్జున్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గురునాథం, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో విశేష ఆదరణ



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, సర్పంచ్ సుభాషిణి

తిరుపతి రూరల్: ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేపట్టిన గడప గడపకూ మహాపాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఆయన శనివారం చెర్లోపల్లి పంచాయతీలో పర్యటించారు. ఆయనకు సర్పంచ్ సుభాషిణి, వైఎస్సార్ సీపీ నాయకులు విప్పర్ల వాసుదేవనాయుడు, శుభగిరినాయుడు, ఎంపీటీసీ హరిత ఘన స్వాగతం పలికారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎంపీపీ మోహిత్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో రూ.1.98 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో కర్మక్రియల కేంద్రం, ఆర్వో వాటర్ ప్లాంట్, ప్యామిలీ పార్క్ తదితర పనులకు రూ.1.26 కోట్ల నిధులు వెచ్చించామని తెలిపారు. మరో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు వెల్లడించారు. నాయకులు కోటేశ్వర నాయుడు, పవన్, ప్రసాద్, శంకర్, దొరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 11 నుంచి 19వ తేది వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఆయన శనివారం బ్రహ్మోత్సవాలపై టీటీడీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గరుడ సేవను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయాలన్నారు. వాహన సేవ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని టీటీడీ విజిలెన్స్, పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల లోపు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గతంలో కంటే ఎక్కువ మంది భక్తులు బ్రహ్మోత్సవాలను వీక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయలు, సీఐ ఓబులేసు, ఎస్ఐ హిమబిందు, ఏవీఎస్ఓ విశ్వనాథ్ పాల్గొన్నారు.

భార్యాభర్తలను కలపడమే మా బాధ్యత



మహిళలతో మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

తిరుపతి క్రైం: ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా భార్యాభర్తలను కలపడమే తమ లక్ష్యమని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారు శనివారం తిరుపతిలోని బాలాజీ కాలనీ పోలీస్ క్వార్టర్స్ భవనంలో కుటుంబ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మన దేశంలో కుటుంబ వ్యవస్థ చాలా గొప్పదని, కుటుంబ సభ్యులకు దాన్ని వివరిస్తూ వారిని తిరిగి కలిపే సిద్ధాంతం ఆధారంగా ఈ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలతో మనస్పర్థలకు దారితీసి విడాకుల వరకు వెళుతున్నారని తెలిపారు. ఇరుపక్షాల కుటుంబ సభ్యులను సమావేశపరిచి, రాజీ చేయడానికి ఎస్పీ ముందుకొచ్చారన్నారు. ఇందుకోసం నిపుణులైన సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇప్పించి తిరిగి కలిపే ప్రయత్నం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కమిటీలో పద్మావతి మహిళా వర్సిటీ నుంచి ఇద్దరు శాశ్వత అధ్యాపకులు, రాస్ ఎన్జీవో, లాయర్ సేవాదళ్ అనే లోక్ అదాలత్ నుంచి సభ్యులు, వైద్యులు, మానసిక వైద్యులు, అడ్వకేట్లు సభ్యులుగా ఉంటారని చెప్పారు. దిశ పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులలో 80 శాతం అక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. మొండి కేసులను దర్యాప్తు చేసి న్యాయం చేస్తున్నామన్నారు. ఈ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ వారంలోని అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి ఏఆర్, డీఎస్పీలు రామరాజు, నరసప్ప, కాటమరాజు, సురేష్, నందకిషోర్ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

చంద్రగిరి: మండలంలోని తొండవాడ లో శనివారం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన జ్యోతి ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. వారం క్రితం గడ్డి కొనుగోలు చేసి పొలం వద్ద వామి వేయించింది. శనివారం ఉదయం గడ్డివామికి నిప్పు అంటుకుంది. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది. రూ.25 వేల విలువ గల గడ్డి దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపింది.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి అలిపిరి: తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ప్రాంగణంలో ఉన్న ఉద్యోగుల రిక్రియేషన్ హాల్లో శనివారం ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అధికారులు విజేతలను ప్రకటించారు. క్యారమ్స్‌లో 45 ఏళ్లు దాటిన మహిళల సింగిల్స్ పోటీల్లో రాజేశ్వరి విజయం సాధించగా, శశికళ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లు పైబడిన మహిళల డబుల్స్ పోటీల్లో సుధారాణి, రాజేశ్వరి జట్టు గెలుపొందగా, నిర్మల, వసుధ జట్టు రన్నరప్‌గా నిలిచింది. చెస్‌లో 45 ఏళ్లు పైబడిన మహిళల చెస్ పోటీల్లో సాహిత్య గెలుపొందగా, కల్పన రన్నరప్‌గా నిలిచారు. వారిని ఉద్యోగులు అభినందించారు.

ఎస్వీయూలో జాతీయ సదస్సు

తిరుచానూరు : రుసుం ప్రాజెక్టు సహకారంతో ఎస్వీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శనివారం క్రియేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్టార్టప్ జాతీయ సదస్సు నిర్వహించారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ స్టార్ట్ ఆఫ్ ఎకో సిస్టమ్‌ను బలోపేతం చేయాలన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చే అధ్యాపకులకు వర్సిటీ మద్దతునిస్తుందన్నారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థి భాను వితలం స్టార్టప్‌ల అభివృద్ధి గురించి వివరించారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసరెడ్డి, రుసుం కోఆర్డినేటర్ డీన్ విజయభాస్కరరావు, ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు విశ్వనాథ్‌కు నివాళి

తిరుపతి కల్చరల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణం పట్టే అద్భుత కళాఖండాలను రూపొందించిన కళా తపస్వి కాశీనాథుని విశ్వనాథ్‌కు తిరుపతి బ్రాహ్మణ సమాజం కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో ఉన్న పరియాలను గుర్తు చేసుకున్నారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, గౌరవ సలహాదారుడు మనోహర్, సహాయ కార్యదర్శులు వోవీ.రాఘవ శర్మ, భీమాస్ అశోక్, రవికుమార్, వేదం హరిప్రసాద్, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ క్యాషియర్ కుమార్ పాల్గొన్నారు.

రేపు పేటోత్సవం

తిరుపతి కల్చరల్/తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని కోదండరామస్వామి ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సోమవారం కూపుచంద్రపేట గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ఊరేగింపు ఉదయం 5 గంటలకు బయలుదేరి 10 గంటలకు కూపుచంద్రపేట చేరుకుంటుంది. అక్కడ స్వామి, అమ్మవారికి స్నపన తిరుమంజనం చేస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఊంజల్ సేవ చేపడతారు. అనంతరం 5 గంటలకు గ్రామోత్సవం నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ప్రతి ఏటా మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా ఈ ఉత్సవాన్ని చేపట్టడం ఆనవాయితీ. ఊరేగింపులో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

చంద్రగిరి: జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. వారు శనివారం ముంగిలిపట్టు సమీపంలోని జగనన్న కాలనీలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం సరిపోక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్లే ఎక్కువ మంది ఇళ్లు కట్టుకోవడం లేదన్నారు. ఆర్థిక సాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఇనుము, సిమెంట్, ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, శ్రీరాములు, చంద్రశేఖర్‌రెడ్డి, గోవింద స్వామి, పద్మనాభరెడ్డి, శ్రీనివాసులు, మంజుల పాల్గొన్నారు.

బలిజ భవన్‌ను పరిరక్షించాలని వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బలిజ, కాపు నేతలు

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులోని బలిజ భవన్‌ను పరిరక్షించాలని బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ కోరారు. వారు శనివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బలిజ భవన్ నిర్మాణం ప్రారంభ దశలోనే ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుతం దాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అక్కడ వ్యర్థాలను వేయడమే కాక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాపోయారు. స్పందించిన జిల్లా కలెక్టర్ తిరుపతి తహసీల్దార్‌కు ఫోన్ చేసి తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాపు నాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణానిధి, అఖిల భారత గాజుల బలిజ సంఘం అధ్యక్షుడు ఆళ్వారు మురళి, బెల్లంకొండ సురేష్, కాపు సంక్షేమ యువసేన జిల్లా అధ్యక్షుడు రాజు రాయల్, మోహన్, హేమంత్, రవి, రవీంద్ర, విజయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



గౌతమ్

శ్రీకాళహస్తి రూరల్: అరవకొత్తూరుకు చెందిన మురళి కుమారుడు గౌతమ్ (13) శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9154141891, 8985996457 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి శనివారం భర్తతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. – తిరుమల